నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | NIZAMABAD

## ప్రజాభిమానంతో న్యాయపీఠాలకు ఆదరణ

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల**

**లోక్ అదాలత్‌లో 26,026 కేసుల పరిష్కారం**



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 28: జిల్లాలోని కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు మంచి స్పందన వచ్చింది. కక్షిదారుల మధ్య రాజీ కుదరడంతో వేలాది కేసులకు మోక్షం లభించింది. జిల్లా కోర్టుతో పాటు బోధన్, ఆర్మూర్ కోర్టులో మొత్తం 26,026 కేసులను పరిష్కరించినట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి వెల్లడించారు. మరోవైపు, న్యాయ వివాదాలు దీర్ఘకాలం కొనసాగరాదనే లక్ష్యంతో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కక్షిదారులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొని వారి న్యాయ వివాదాలను పరిష్కరించుకునే వెలుసుబాటు కల్పించినట్లు చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్‌బాబు, జూనియర్ సివిల్ జడ్జీలు కుష్బు ఉపాధ్యాయ్, గోపికృష్ణ, శ్రీనివాసరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, బార్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.





**ప్రకృతిలో ప్రతీది అద్భుతమే.** కనువిందైన దృశ్యమే. కోటి కాంతులు వెదజల్లే సూరీడు ఉదయిస్తూనే జగత్తును మేల్కొలుపుతాడు. తెల్లవారుజామున తూర్పు దిక్కున ప్రభవించే భానుడు ప్రపంచంపై పసిడి కాంతులు విరజిమ్ముతాడు. ఆ సమయంలో ఎరుపు, బంగారు వర్ణంతో కనిపించే ఆకాశం మనల్ని మరోలోకంలోకి తీసుకెళ్తుంది. పశ్చిమాన వాలిపోయే సమయంలోనూ ఈ సుందర దృశ్యం మరోమారు సాక్షాత్కరిస్తుంది. శనివారం సూర్యుడు ఉదయిస్తున్న వేళ ఆకాశం పసిడికాంతులతో ముచ్చటగొలిపింది. నిత్యం నీలిరంగులో కనిపించే వినీలాకాశం పొద్దుపొద్దున బంగారు వర్ణంలో కనిపించడాన్ని చూసిన వారంతా తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

– కామారెడ్డి ఫొటోగ్రాఫర్/బాన్సువాడ రూరల్

# త్వరలోనే కొత్త వీసీ

- అక్టోబర్ 4న సెర్చ్ కమిటీ భేటీ
- ముగ్గురి పేర్లను ఖరారు చేయనున్న కమిటీ
- కొత్త వైస్ చాన్సలర్ నియామకంపై ఉత్కంఠ
- టీయూలో దిగజారిన పరిపాలన



**తెలంగాణ యూనివర్సిటీకి** త్వరలోనే కొత్త వైస్ చాన్సలర్ వచ్చే నియమితులయ్యే అవకాశమున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వీసీల నియామకం కోసం ఏర్పాటైన సెర్చ్ కమిటీ అక్టోబర్ 4వ తేదీన భేటీ కానున్నది. ఈ సమావేశంలో టీయూకు సంబంధించి ముగ్గురి పేర్లను ఖరారు చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నది. సెర్చ్ కమిటీ భేటీ నేపథ్యంలో ఆశావహులతోపాటు వర్సిటీ వర్గాల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. వీసీ పదవిపై కన్నేసిన ఆశావహులు జోరుగా పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

–నిజామాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ల నియామకం కోసం ప్రభుత్వం గతంలోనే సెర్చ్ కమిటీని నియమించింది. ఆశావహుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. కానీ, సెర్చ్ కమిటీ భేటీ కాకపోవడంతో వీసీల నియామక ప్రక్రియలో ముందడుగు పడలేదు. అయితే, అక్టోబర్ 4న కమిటీ భేటీకి ముహూర్తం ఖరారైంది. ఆశావాహుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్న కమిటీ.. కొందరి పేర్లను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదించనున్నది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ యూనివర్సిటీకి కొత్త వీసీగా ఎవరు వస్తారన్నది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. చాలా మంది పోటీ పడుతుండడంతో నియామకంలో ఎలాంటి అర్హతలను ప్రాతిపదిక తీసుకుంటారు? అన్నది ఉత్కంఠకు దారి తీస్తోంది. పైరవీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసి రాజకీయ నియామకాలను చేపడుతుందా? లేదంటే నైపుణ్యం అర్హతగా తీసుకుని విలువలతో కూడిన వ్యక్తులను వీసీగా నియమిస్తుందా? అన్నది విద్యార్థుల్లో చర్చకు దారి తీస్తోంది.

### గాడి తప్పిన పాలన

తెలంగాణ యూనివర్సిటీలో పాలన పూర్తిగా గాడి తప్పింది. ఏడాదిన్నర కాలంగా శాశ్వత వీసీ లేడు. ఇన్‌చార్జ్ వీసీగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించినా వాళ్లు ఇక్కడకు వచ్చిందీ లేదు. పాలనను గాడిలో పెట్టిందీ లేదు. వర్సిటీలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు పరిస్థితి దాపురించింది. శాశ్వత వీసీని నియమిస్తే తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించే అవకాశముంది. వసతి గృహాల్లో పరిస్థితి అధ్వానంగా మారుతున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో బాధ్యులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. భోజనంలో బల్లులు, పురుగులు, బొద్దింకలు రాగా, తాజాగా హాస్టళ్లలో పాములు చక్కర్లు కొడుతుండడం విద్యార్థులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నది.

### జోరుగా పైరవీలు..

వీసీ పోస్టు కోసం పలువురు ప్రొఫెసర్లు పైరవీలు చేసుకుంటున్నారు. టీయూలో గతంలో పని చేసి వెళ్లిన వారితో పాటు ప్రస్తుతం కీలక స్థానంలో ఉన్న వారు సైతం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. టీయూలో ఏడాదిన్నరగా చోటు చేసుకుంటున్న పరిణామాలను దగ్గరి నుంచి చూస్తున్న కీలక వ్యక్తి సైతం ఇక్కడ తిష్ట వేసేందుకు జోరుగా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, అనేక అవినీతి ఆరోపణలు, గత వీసీతో అంటకాగిన ఘటనలు మైనస్‌గా మారుతుండడంతో సదరు వ్యక్తి ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. ఆయనకు అవకాశం రాకపోతే, కాంగ్రెస్ నాయకుడి బంధువు ఒకరు వీసీగా వచ్చే అవకాశముందన్న ప్రచారం జరుగుతున్నది. ఉన్నత విద్యా మండలిలోనూ చక్రం తిప్పుతున్న వారు సైతం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డా.భూపతిరెడ్డిని మచ్చిక చేసుకుంటున్నట్లు చర్చ నడుస్తున్నది. నైపుణ్యం ఆధారంగానే వీసీని నియమించాలని, బంధుప్రీతి, రాజకీయ సంబంధాలను పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణ యూనివర్సిటీ పేరు మరింత దిగజారుతుందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి.

# టీజీవోలో మోగిన నగారా

**ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ**



- అక్టోబర్ 5న నామినేషన్ల స్వీకరణ
- అదేరోజు పోలింగ్, కౌంటింగ్ కూడా..
- ఎలక్షన్ ఆఫీసర్‌గా కామారెడ్డి డీటీవో
- ఎన్నికలు జరిగేనా.. లేక ఏకగ్రీవమా?
- నామినేషన్ల దాఖలుపై సర్వత్రా ఉత్కంఠ
- టీఎన్‌జీవోలో ఊసే లేని కొత్త కార్యవర్గ కూర్పు

నిజామాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్‌జీవో) అసోసియేషన్‌లో మొదలైన ప్రక్షాళన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) అసోసియేషన్‌లో సెగలు రేపింది. టీఎన్‌జీవోలో అనర్హుల ఏరివేత ఇప్పటికే విజయవంతంగా జరిగింది. గెజిటెడ్ ఉద్యోగులకు టీఎన్‌జీవోలో చోటు దక్కడంపై అవాక్కయిన ప్రభుత్వం వెంటనే తప్పుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్ర నాయకత్వం రంగంలోకి దిగి నిజామాబాద్ సంఘంలో మార్పులు చేర్పులు చేసింది. టీఎన్‌జీవోలో పదవిని వీడిన నేతలు.. ఇప్పుడేం చేయాలో తెలియక వేరే సంఘంలో చోటు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఫలితంగా నిజామాబాద్ గెజిటెడ్ సంఘంలో ఎన్నికల వేడి రగిలింది. తెలంగాణ గెజిటెడ్ సంఘ అధ్యక్ష పదవి కోసం నగారా మోగింది. అక్టోబర్ 5న నామినేషన్ దాఖలు మొదలు అదే రోజు ఎన్నికలు, ఫలితాలను ప్రకటించనున్నారు. టీజీవో ఎన్నికల అధికారిగా కామారెడ్డి రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నికల అథారిటీ నియమించింది. నోటిఫికేషన్ జారీ కావడంతో పలువురు ఆశావాహుల్లో ఉత్సాహం కనిపిస్తుండగా, టీఎన్‌జీవో నుంచి వచ్చిన నేతలు సైతం బరిలోకి దిగేందుకు సిద్ధం కావడంపై విస్మయం వ్యక్తమవుతున్నది. అసలు ఎన్నికలు జరుగుతాయా? లేదా ఏకగ్రీవంగానే అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందా? అన్న దానిపై చర్చ జరుగుతున్నది.

### అన్ని ఒకే రోజు..

వాస్తవానికి కొందరు దశాబ్దాలుగా టీఎన్‌జీవోలో పాతుకుపోవడంతో వారిని తొలగించాలనే అభిప్రాయం వ్యక్తమైంది. అయితే, విచిత్రంగా టీఎన్‌జీవోలో కాకుండా టీజీవోలో రాకెట్ వేగంతో ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతుండడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొన్నది. ఏండ్లుగా టీఎన్‌జీవోలో కీలక స్థానాల్లో ఉన్న వ్యక్తులు తప్పుకోవడంతో అనివార్యంగా ఎన్నికలు జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు రాష్ట్ర నాయకులు 20 రోజుల క్రితం నిజామాబాద్‌కు వచ్చి ఈ విషయంపై స్పష్టతను ఇచ్చారు. కానీ ఎన్నికలను మాత్రం నిర్వహించడం లేదు. మొదట తాలూకా స్థాయిలో ఎన్నికలు జరపాల్సి ఉంది. ఆ తర్వాత జిల్లా కార్యవర్గం కూర్పు జరగాలి. టీఎన్‌జీవో ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ ముందడుగు పడక పోవడంపై ఉద్యోగుల్లో అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, మొన్నటిదాకా చడీచప్పుడు లేని టీజీవోలో ఎన్నికల కోలాహలం నెలకొనడం, ఒకే రోజు నామినేషన్ల స్వీకరణ, అదే రోజు పోలింగ్, ఫలితాల వెల్లడి కానుండడం అనేక రకాల చర్చలకు దారి తీసింది. టీజీవో ఎన్నికలకు సెప్టెంబర్ 27న నోటిఫికేషన్ జారీ చేశారు. సాంకేతికంగా వారం, పది రోజుల గడువు ఉన్నట్లుగా చూపించినప్పటికీ ఒకే రోజు (అక్టోబర్ 5న) తతంగాన్ని ముగిస్తుండడం ప్రాధాన్యత సంతరించుకున్నది. పైగా ఓటరు జాబితాను ముందస్తుగానే ప్రకటించాలి. ఈ విషయంలోనూ స్పష్టత కరువైంది. ఓటరు జాబితాను కూడా పోలింగ్ రోజే ప్రకటిస్తారా.. ముందు రోజే విడుదల చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

### పారదర్శకంగా ఎన్నికలు..



తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించారు. నాకిచ్చిన బాధ్యతను న్యాయబద్ధంగా, పారదర్శకంగా పూర్తి చేస్తాను. అక్టోబర్ 5న పోలింగ్, ఫలితాలు ఉంటాయి. ఉద్యోగులందరితో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను శాంతియుతంగా పూర్తి చేస్తాం.

**- కె.శ్రీనివాస్ రెడ్డి, టీజీవో ఎన్నికల అధికారి (కామారెడ్డి రవాణా శాఖ అధికారి)**

# పనుల్లో ఎందుకింత జాప్యం?

- పెండింగ్ పనులపైనివేదిక ఇవ్వండి
- 'దిశ' సమావేశంలో ఎంపీ అర్వింద్
- మంత్రి పదవిరాలేదని సుదర్శన్‌రెడ్డి అలిగిండని వ్యాఖ్య
- ప్రొటోకాల్ పాటించట్లేదని ఎమ్మెల్యేల ఆగ్రహం

కంఠేశ్వర్, సెప్టెంబర్ 28: అభివృద్ధి పనుల్లో అంతులేని జాప్యం జరుగుతున్నదని ఎంపీ అర్వింద్ అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్ పనులపై చర్చించేందుకు అక్టోబర్ రెండోవారంలో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం ద్వారా మంజూరైన పనులు ఏయే దశల్లో ఉన్నాయో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన 'దిశ' సమావేశంలో, సమావేశం అనంతరం విలేకరులతో అర్వింద్ మాట్లాడారు. మాధవ్‌నగర్, అడవిమామిడిపల్లి, ఆర్మూర్‌లోని ఆర్‌వోబీ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఈ విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సుదర్శన్‌రెడ్డి మంత్రి పదవి రాక అలిగిండన్నారు. 'రేవంత్‌రెడ్డి.. సుదర్శన్‌రెడ్డికి త్వరగా మంత్రి పదవి ఇచ్చేయండి. ఆయన పనేదో ఆయన చేసుకుంటాడు. లేకుంటే అలిగి కూర్చుంటాడని' వ్యాఖ్యానించారు.



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, వేదికపై ఎమ్మెల్యేలు, కలెక్టర్

### 'పెట్రోల్ పోసి పేషిని తగులబెడతా..'

జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాను పట్టించుకోవడం లేదని, ఫలితంగా అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు నెలల నుంచి ఇన్‌చార్జి మంత్రి జిల్లాకు రాకపోతే అభివృద్ధి పనులు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. ఇదిలాగే కొనసాగితే సెక్రటేరియట్‌లోని మంత్రి పేషిని పెట్రోల్ పోసి తగులబెడతానని వ్యాఖ్యానించారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మండిపడ్డారు. జిల్లాలో ఎటువంటి కార్యక్రమం జరిగినా సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అడిషనల్ కలెక్టర్ అంకిత, మున్సిపల్ కమిషనర్ మకరంద్ పాల్గొన్నారు.




### ఫ్రెష్ జోష్



నిజామాబాద్ మెడికల్ కాలేజీలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల ఫ్యాషన్ పరేడ్ ఆకట్టుకుంది. – ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 28

